# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU



తెలంగాణ వెన్నెల వాక్కు **విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :73 | 29-09- 2026 | మంగళవారం | పేజీలు: 4 | వెల:03/-


# అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడాలి

## ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం: సీఎం రేవంత్‌రెడ్డి

### ఓటర్ల జాబితా సవరణపై స్పష్టత ఉండాలి.. తొలగింపుల్లో జాగ్రత్త అవసరం



న్యూఢిల్లీ: అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, అర్హతల నిర్ధారణ వంటి ప్రక్రియలు పారదర్శకంగా, ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని సూచించారు.

అసోంకు చెందిన 'ప్రతిదిన్' మీడియా నెట్‌వర్క్ న్యూఢిల్లీలో నిర్వహించిన 'ది కాంక్లేవ్--2026'లో 'భారత్ తదుపరి అధ్యాయం' అంశంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దేశ భవిష్యత్ దిశతో పాటు తెలంగాణ అభివృద్ధి, విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతులు, నియోజకవర్గాల పునర్విభజన, ఓటర్ల జాబితా సవరణ తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

దేశంలో జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్యలో తగ్గుదల ఎలా జరుగుతుందనే అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లు తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఓటు హక్కుకు సంబంధించి ప్రజల్లో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఇప్పటికే తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించాలన్నది తన ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు గైర్హాజరు, తరలిపోయినవారు, మరణించినవారు, నకిలీ పేర్లు వంటి విభాగాల్లో గుర్తించబడటంపై ప్రభుత్వం గతంలో ఎన్నికల సంఘం దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లింది. ముఖ్యమంత్రి విజ్ఞప్తుల నేపథ్యంలో అభ్యంతరాలు, క్లెయిమ్‌ల దాఖలుకు గడువును అక్టోబర్ 7 వరకు, తుది ఓటర్ల జాబితా ప్రచురణ గడువును నవంబర్ 9 వరకు పొడిగించారు.

నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో రాజకీయ ప్రాతినిధ్య పరంగా నష్టం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. 1976లో లోక్‌సభ స్థానాల పునర్విభజనను నిలిపివేసిన నిర్ణయం, అనంతర పరిణామాలను ప్రస్తావిస్తూ జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు.

లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గితే జాతీయ విధానాల రూపకల్పనలో ఆయా రాష్ట్రాల అంశాలకు ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి

మిగతా వివరాలు రెండో పేజీలో..

# దేశ ప్రధాని రాహుల్ గాంధే

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలు



హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో రాబోయే రోజుల్లో బిజేపి పాలనకు అంతం తప్పదని, భవిష్యత్తులో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ దేశ ప్రధాని కాబోతున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా నెరేడుచర్లలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహలతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో గడిచిన పదేళ్లకు పైగా అధికారంలో ఉన్న బిజేపి ప్రభుత్వం ప్రజాస్వామిక సూత్రాలను, రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను తీవ్రంగా నిర్వీర్యం చేస్తోందని మంత్రి ఉత్తమ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో ఉన్న కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాస్తూ సామాన్య ప్రజల, రైతుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ప్రజల ఓట్ల హక్కును సైతం అపహాస్యం చేస్తూ, ఓట్ల చోరీకి మరియు వివిధ రకాల మోసపూరిత రాజకీయాలకు బిజేపి నాయకత్వం పాల్పడుతోందని సభ వేదికగా విమర్శించారు. దేశంలో ధర్మం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన

మిగతా వివరాలు రెండో పేజీలో..

# తెలంగాణలో స్థానిక కోటాపై సుప్రీంకోర్టు స్పష్టత

## వైద్య,దంత విద్య ప్రవేశాల్లో నాలుగేళ్ల నిబంధన సమర్థన




న్యూఢిల్లీ: తెలంగాణలో వైద్య, దంత విద్య ప్రవేశాల్లో స్థానిక అభ్యర్థుల కోటాకు సంబంధించి నాలుగేళ్ల నిబంధనపై సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. రాష్ట్రంలో స్థానిక అభ్యర్థిగా పరిగణించేందుకు నిర్దేశించిన నాలుగేళ్ల వరుస అధ్యయనం లేదా నివాస నిబంధన చెల్లుబాటు అవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నిబంధన రాజ్యాంగంలోని రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగానే ఉందని పేర్కొంది.

తెలంగాణ వైద్య, దంత కళాశాలల ప్రవేశ నిబంధనల్లో స్థానిక అభ్యర్థుల అర్హతకు నాలుగేళ్ల నిబంధనను అమలు చేస్తున్నారు. దీనిపై తెలంగాణ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం 2025 సెప్టెంబర్ 1న తీర్పు వెలువరించింది. స్థానిక అభ్యర్థి నిర్వచనం స్పష్టంగా ఉన్నందున దానిని మార్చి చదవాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. రాష్ట్రపతి ఉత్తర్వులు, గత తీర్పులకు అనుగుణంగా ఈ నిబంధన ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్ర కోటాలోని స్థానిక

మిగతా వివరాలు రెండో పేజీలో..

# ఈడీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతల ఆందోళన

## పొంగులేటి ఆస్తులపై దర్యాప్తు వివరాలు వెల్లడించాలని డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 28: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన ఆస్తులపై ఈడీ దర్యాప్తు వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. గతంలో మంత్రి పొంగులేటికి సంబంధించిన నివాసాలు, కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ప్రస్తావించారు.

సోదాలు నిర్వహించి రెండేళ్లు కావస్తున్నప్పటికీ దర్యాప్తు ఏ దశలో ఉందో, తదుపరి చర్యలు ఏమిటో ప్రజలకు స్పష్టత ఇవ్వలేదని వారు ప్రశ్నించారు. సోదాల్లో ఏమైనా పత్రాలు, నగదు లేదా ఇతర ఆధారాలు స్వాధీనం చేసుకున్నారా? తదుపరి విచారణలో ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే

మిగతా వివరాలు రెండో పేజీలో..

# ఇంటి స్థలాల హద్దులపై ప్రభుత్వం ఫోకస్

## మీ ఇంటి స్థలం ఎన్ని గజాలో ఇక మ్యాప్‌లో పక్కాగా!



హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో దశాబ్దాలుగా నలుగుతున్న భూములు మరియు ఇంటి స్థలాల సరిహద్దు వివాదాలకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ప్రతీ పౌరుడికి సంబంధించిన ఇంటి స్థలం హద్దులు, విస్తీర్ణం మరియు దిక్కులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ మ్యాప్‌లో పక్కాగా నమోదు చేసే దిశగా వేగవంతమైన చర్యలు చేపడుతున్నట్లు రెవెన్యూ మరియు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రతి ఒక్కరి ఆస్తికి చట్టబద్ధమైన రక్షణ కల్పిస్తూ, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు తావులేకుండా చేయడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలను మరియు స్థలాల తగాదాలను పరిష్కరించే క్రమంలో ప్రతీ ఇంటి స్థలానికి సంబంధించి జియో-కోఆర్డినేట్స్‌తో కూడిన డిజిటల్ మ్యాప్‌లను ప్రభుత్వం సిద్ధం చేయనుంది. దీనివల్ల ఒక పౌరునికి చెందిన స్థలం ఎన్ని గజాలు ఉందనేది స్పష్టంగా డిజిటల్ రికార్డులలో కొలతలతో సహా ప్రత్యక్షమవుతుంది. భూమి యజమాని తన స్థలాన్ని ప్రపంచంలో ఎక్కడి నుంచైనా డిజిటల్ మ్యాప్ ద్వారా సరి చూసుకునే వెసులుబాటు కలుగుతుంది. దీనివల్ల అక్రమార్కుల భయం లేకుండా తమ స్థలాలకు సంబంధించిన కచ్చితమైన వివరాలు యజమానుల వద్ద అందుబాటులో ఉంటాయి. సరిహద్దుల లెక్కింపు అత్యంత పారదర్శకంగా జరగడం వల్ల పౌరులకు తమ సొంత ఆస్తులపై సంపూర్ణ నియంత్రణ, నమ్మకం లభిస్తాయి.

సాధారణంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో కూడా పక్కపక్క స్థలాల యజమానుల మధ్య హద్దుల విషయంలో తీవ్ర వివాదాలు నెలకొంటుంటాయి. సరిహద్దుల గుర్తింపు సరిగ్గా లేకపోవడం, పాత రికార్డులలో తేడాలు ఉండటం వల్ల అనేక మంది

మిగతా వివరాలు రెండో పేజీలో..

# తెలంగాణ స్థానికతపై అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు




హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక అభ్యర్థుల గుర్తింపు, విద్యా సంస్థలలో ప్రవేశాలు మరియు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించి దశాబ్దాలుగా నలుగుతున్న అత్యంత సంక్లిష్టమైన స్థానికత వివాదానికి దేశ అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పుతో ముగింపు పలికింది. రాష్ట్రంలోని వైద్య విద్యా కోర్సులైన వైద్య విద్య, దంత వైద్య ప్రవేశాలలో స్థానిక కోటా మరియు సడలింపుల ప్రయోజనాలు పొందడానికి వరుసగా నాలుగేళ్ల పాటు నిరంతర విద్యాభ్యాసం ఖచ్చితంగా ఉండాల్సిందే అని స్పష్టం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలను అత్యున్నత ధర్మాసనం పూర్తిగా సమర్థించింది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన స్థానిక సడలింపుల మార్గదర్శకాలు, నిబంధనలు పూర్తిగా చట్టబద్ధమైనవని, వీటి ద్వారా స్థానిక విద్యార్థుల హక్కులకు సంపూర్ణ రక్షణ లభిస్తుందని న్యాయస్థానం తేల్చిచెప్పింది.

ఈ కేసు వివరాల్లోకి వెళితే, తెలంగాణ రాష్ట్రంలో వైద్య స్థానాల కేటాయింపు ప్రక్రియలో స్థానిక కోటా కింద అర్హత సాధించాలంటే అభ్యర్థి అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లపాటు రాష్ట్రంలో ఉన్న విద్యాసంస్థల్లోనే చదువుకొని ఉండాలనే నిబంధనను తెలంగాణ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. అయితే, ఈ నిబంధన వల్ల ఇతర ప్రాంతాల్లో లేదా విదేశాల్లో

మిగతా వివరాలు రెండో పేజీలో..

# సొంత గడ్డపై కమల పరీక్ష..!

## కిషన్ రెడ్డి గ్రాఫ్‌ను తేల్చబోతున్న ఖైరతాబాద్ సమరం!

## కిషన్ రెడ్డికి 'సికింద్రాబాద్' సవాల్.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గండం!




తెలంగాణ రాజకీయ రంగస్థలంపై మరో తీవ్ర ఉత్కంఠ పూరితమైన ఘట్టానికి తెరలేచింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద శాసనసభ్యునిగా దానం నాగేందర్ పదవిపై అనర్హత వేటు పడటం, శాసనసభ నిబంధనల ప్రకారం గెజిట్ విడుదల ప్రక్రియ వేగవంతమై ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీగా ప్రకటితమవ్వడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న అత్యంత ప్రాధాన్యత కలిగిన ఖైరతాబాద్ పీఠాన్ని దక్కించుకోవడం అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, మరియు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలకు కేవలం ఒక సాధారణ శాసనసభ స్థానాన్ని గెలుచుకోవడం మాత్రమే కాదు; అది ఆయా పార్టీల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ముడిపడిన పోరాటంగా మారింది.
రాష్ట్రంలో రాబోయే సాధారణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్న నేపథ్యంలో, రాజధాని నగర పరిధిలో ప్రజల నాడి ఎలా ఉందో, ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతోందో తేల్చి చెప్పే అత్యంత కీలకమైన లిట్మస్ టెస్ట్‌గా ఈ ఉపఎన్నిక రూపాంతరం చెందింది.
ఈ ముక్కోణపు రణరంగంలో అందరికంటే ఎక్కువ ఒత్తిడిని, తీవ్రమైన ప్రతికూల రాజకీయ పవనాలను ఎదుర్కొంటున్నది కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోకి రావడమే ఇందుకు అత్యంత ప్రధాన కారణం. సొంత పార్లమెంట్ సెగ్మెంట్‌లో, అందునా తానే రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు పర్యవేక్షిస్తున్న అత్యంత కీలక సమయంలో ఈ ఉపఎన్నిక ఎదురుకావడం ఆయన నాయకత్వ సామర్థ్యానికి, నగరంలో ఆయనకున్న రాజకీయ పట్టుకు పెను సవాలుగా మారింది. కిషన్ రెడ్డి కేవలం విలేకరుల సమావేశాలకు, మైకుల ముందుద.కు మాత్రమే పరిమితమై కార్యకర్తలను, ఓటర్లను మభ్యపెట్టే ప్రెస్ మీట్ రాజకీయాలు నడుపుతారా లేక స్వయంగా క్షేత్రస్థాయికి దిగి ప్రతి డివిజన్, ప్రతి పోలింగ్ బూత్ తిరుగుతూ అసంతృప్తితో ఉన్న పార్టీ శ్రేణులను ఏకం చేసి బీజేపీని విజయం దిశగా నడిపిస్తారా అనే ప్రశ్నలు కేవలం ప్రత్యర్థి పార్టీల్లోనే కాకుండా స్వపక్షమైన కమల దళంలోనూ తీవ్రంగా చర్చనీయాంశమవుతున్నాయి.
కిషన్ రెడ్డి నాయకత్వానికి ఈ ఉపఎన్నిక పెద్ద అగ్నిపరీక్షగా మారడానికి ప్రధాన కారణం గతంలో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోనే జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక చేదు ఫలితాలే. 2023 సాధారణ ఎన్నికల్లో అక్కడ బీజేపీ అభ్యర్థికి గణనీయమైన స్థాయిలో ఓట్లు వచ్చి రికార్డు నమోదు చేస్తే, ఆ తర్వాత జరిగిన బైపోల్ నాటికి ఆ ఓటింగ్ శాతం దారుణంగా పడిపోయి పార్టీ మూడో స్థానానికి పరిమితమై తీవ్ర పరాభవాన్ని మూటగట్టుకుంది. ఆ సమయంలో అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచార వ్యూహాల వరకు అంతా కిషన్ రెడ్డి కనుసన్నల్లోనే సాగాయని, పార్టీలోని మిగిలిన కీలక నాయకులను, సీనియర్లను సమన్వయం చేసుకోవడంలో ఆయన ఘోరంగా విఫలమయ్యారనే తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కేంద్ర మంత్రిగా ఉంటూ సొంత పార్లమెంట్ పరిధిలోనే ఓటు బ్యాంక్ క్షీణించడం కమల దళంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అదే రకమైన నిర్లక్ష్యం, వ్యూహాత్మక లోపాలు ఖైరతాబాద్‌లోనూ పునరావృతమైతే కిషన్ రెడ్డి రాజకీయ గ్రాఫ్‌పై కోలుకోలేని దెబ్బ పడే ప్రమాదం ఉంది. అందుకే ఈసారి సొంత నిర్ణయాలకే పరిమితం కాకుండా అమిత్ షా, సునీల్ బన్సల్ వంటి జాతీయ నాయకుల ప్రత్యక్ష పర్యవేక్షణలో సరికొత్త ప్రచార వ్యూహాలకు పదును పెడుతున్నట్లు తెలుస్తోంది.
మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఏ పార్టీకి నిజమైన ఆధిపత్యం ఉందో ఈ ఉపఎన్నిక స్పష్టంగా తేల్చనుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ రాజధానిపై తమ పట్టును చాటుకోవాలని తీవ్రంగా శ్రమిస్తోంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో నగర పరిధిలో ఆశించిన స్థాయిలో బోణీ కొట్టలేకపోయిన కాంగ్రెస్, ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి ప్రాజెక్టులు, మూసీ ప్రక్షాళన వంటి ప్రాధాన్యతలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా చేసుకుని విజయం సాధించాలని తహతహలాడుతోంది.
ఇక నగరంలో సాంప్రదాయకంగా బలమైన క్యాడర్ ఉన్న బీఆర్ఎస్‌కు ఈ ఎన్నిక ఉనికిని కాపాడుకునే అస్తిత్వ పోరాటం లాంటిది. తమ పార్టీ గుర్తుపై గెలిచి అధికార ఆశతో కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేత స్థానాన్ని తిరిగి కైవసం చేసుకుని, హైదరాబాద్‌పై గులాబీ జెండా మళ్లీ ఎగురవేయాలని బీఆర్ఎస్ తీవ్రంగా భావిస్తోంది. ఈ ఉపఎన్నికలో అత్యంత ఆసక్తికరమైన అంశం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాత్ర. బీఆర్ఎస్ కార్యకర్తల్లో నైతిక ఉత్సాహం నింపాలంటే కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి ప్రచారం చేయాలని ఆ పార్టీ శ్రేణులు ముక్తకంఠంతో కోరుకుంటున్నాయి. అయితే, కేసీఆర్ నిజంగానే ప్రజల మధ్యకు వచ్చి ఖైరతాబాద్ వీధుల్లో ప్రచారం చేస్తారా? లేక ఎప్పటిలాగే ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కే పరిమితమై, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీష్ రావుల భుజాలపైనే ఎన్నికల పోరాట భారాన్ని మోపి మిన్నకుండిపోతారా అన్నది తీవ్ర సస్పెన్స్‌గా మారింది.
దీనికితోడు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముగిసిన తర్వాత గణనీయంగా మార్పు చెందిన ఓటర్ల సంఖ్య కూడా ప్రధాన పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. వేలాది డూప్లికేట్, వలస ఓట్ల తొలగింపు తర్వాత వెలువడే తుది జాబితా ఫలితాన్ని ఏ రకంగా తిరగరాస్తుందోనన్న భయం అన్ని పక్షాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది.
మొత్తానికి ఖైరతాబాద్ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయంలో ఒక కీలకమైన మలుపు తిప్పబోతోంది. కేవలం విలేకరుల సమావేశాలకే పరిమితం కాకుండా కిషన్ రెడ్డి బీజేపీకి ఇక్కడ జయకేతనం అందిస్తారా? రేవంత్ సర్కార్ రాజధానిలో బోణీ కొట్టి తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంటుందా? కేసీఆర్ ఫామ్‌హౌస్ దాటి వచ్చి గులాబీ శ్రేణులను ముందుకు నడిపిస్తారా? అనేది తేలాలంటే ఉపఎన్నికల సమర భేరి మోగి తుది తీర్పు వెలువడే వరకు వేచి చూడాల్సిందే!



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి అల్లోలరి



నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంతో పాటు సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సోమవారం పరామర్శించారు. నిర్మల్ మంజులాపూర్‌లో విద్యుత్ షాక్‌తో మరణించిన ఎంబడి శివకుమార్ కుటుంబంతో పాటు ధ్యాగవాడలో ప్రసాద్, చించోలి (బి)లో నారాయణరెడ్డి, సారంగాపూర్‌లో నర్సాగౌడ్, స్వర్ణలో అంజయ్య, దుప్య తండాలో మాజీ సర్పంచ్ ప్రహ్లాద్ కుటుంబాలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మాధవరావు, నాయకులు ధర్మాజీ రాజేందర్, నారాయణరెడ్డి, వెంకట్రాంరెడ్డి, మహిపాల్ రెడ్డి, కౌన్సిలర్ గోపి పాల్గొన్నారు.

## డిజిటల్ క్రాప్ సర్వేలో రైతులు వివరాలు నమోదు చేయించుకోవాలి



ముధోల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల పరిధిలోని విట్టోలి క్లస్టర్‌కు చెందిన రువ్వి, గన్నోర గ్రామాల్లో కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) రిషికేష్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాలంటీర్లు రైతుల పొలాల్లో సాగు వివరాలను తప్పులు లేకుండా కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. సర్వే సమయంలో రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. ఈ డేటా ఆధారంగానే ప్రభుత్వ రాయితీలు, పంట కొనుగోళ్లు ముడిపడి ఉంటాయని వివరించారు.

## కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరిపై కాంగ్రెస్ నిరసన




హైదరాబాద్/నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గాంధీ భవన్ నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ పాల్గొని మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

## అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడాలి

అభిప్రాయపడ్డారు. అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, స్థానిక వనరులు, మానవ వనరులను ఉపయోగించుకునేలా కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి తగిన సహకారం అందితే రాష్ట్రం మరింత వేగంగా ముందుకు సాగుతుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, ప్రాంతీయ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులు వంటి రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టుల అంశాలను ప్రస్తావించారు.విద్య, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతుల ఆధారంగా తెలంగాణను అభివృద్ధి చేసి దేశ ప్రగతిలో రాష్ట్రాన్ని కీలక భాగస్వామిగా నిలపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. యువతకు విద్యతో పాటు ఉపాధికి అవసరమైన నైపుణ్యాలు అందించడంపై దృష్టి సారించినట్లు చెప్పారు.
ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం, నర్సరీ విద్య వంటి అంశాలపై ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. మాతృభాషతో పాటు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా విద్యా విధానం ఉండాలని, నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు విద్యార్థుల్లో భాష, సమాచార మార్పిడి నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

## దేశ ప్రధాని రాహుల్ గాంధే

ప్రతిసారీ కాంగ్రెస్ నాయకత్వమే అడ్డుగోడగా నిలిచి పోరాటం చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ గత పుష్కర కాలంగా బిజేపి అక్రమాలను, పాలనా వైఫల్యాలను ఏమాత్రం భయం లేకుండా నిర్భయంగా ఎండగడుతున్నారని, ఆయన పోరాట పటిమను దేశ ప్రజలంతా గమనిస్తున్నారని కొనియాడారు.దేశంలోని సకల జనులు, పౌరులు తమ హక్కుల పరిరక్షణ కోసం, ప్రజాస్వామ్య వ్యవస్థల రక్షణ కోసం ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, ప్రజల గొంతును వినే ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి రావాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తున్నారని, దానికి ఏకైక సమాధానం రాహుల్ గాంధీ నాయకత్వమేనని స్పష్టం చేశారు. దేశం మొత్తం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా ఆహ్వానించడానికి సిద్ధంగా ఉందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్రలు, ప్రజా సమస్యలపై ఆయన జరుపుతున్న పోరాటాలు దేశ ప్రజల్లో సరికొత్త ఆశలను, నమ్మకాన్ని నింపాయని చెప్పారు.ఈ సందర్భంగా పేదలకు అందించే రేషన్ కార్డుల పంపిణీ గురించి మాట్లాడుతూ, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి సంపూర్ణంగా కట్టుబడి పనిచేస్తోందని మంత్రి వివరించారు.

## తెలంగాణలో స్థానిక కోటాపై సుప్రీంకోర్టు స్పష్టత

అభ్యర్థుల అర్హతకు ఈ నిబంధన వర్తిస్తుందని తెలిపింది.
అయితే తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, రక్షణ సిబ్బంది తదితరుల పిల్లలు ఉద్యోగరీత్యా రాష్ట్రం వెలుపల చదివిన సందర్భాల్లో కొన్ని మినహాయింపులను కూడా సుప్రీంకోర్టు తీర్పులో పరిగణనలోకి తీసుకుంది. ఇందుకు సంబంధించి తగిన ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.
ఈ తీర్పు ప్రధానంగా వైద్య, దంత విద్య ప్రవేశాల్లో స్థానిక అభ్యర్థుల కోటాకు సంబంధించినదే. రాష్ట్రంలోని అన్ని రకాల స్థానిక రిజర్వేషన్లపై కొత్తగా సాధారణ ఆదేశాలు ఇచ్చిన తీర్పుగా దీనిని పేర్కొనడం సరికాదు

## ఈడీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతల ఆందోళన

వివరాలను ఈడీ అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేశారు.
ఈడీ కార్యాలయంలోకి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేసేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కార్యాలయ గేటు వద్ద బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కొంతమంది నేతలకు ఈడీ అధికారులను కలిసే అవకాశం లభించగా, వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.
మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన వ్యవహారంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లయితే దాని పురోగతిని వెల్లడించాలని, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. కాగా, ఈడీ దర్యాప్తు అంశంపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## తెలంగాణ స్థానికతపై అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు

ప్రాథమిక విద్యను అభ్యసించి తిరిగి తెలంగాణకు వచ్చిన కొందరు విద్యార్థుల హక్కులకు భంగం కలుగుతోందంటూ పలువురు అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని, ఆ తర్వాత దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వినతులను సమగ్రంగా విచారించిన న్యాయమూర్తుల ధర్మాసనం, తెలంగాణ ప్రభుత్వం విధించిన విద్యాభ్యాస నిబంధనలో ఎలాంటి చట్టవిరుద్ధమైన లేదా రాజ్యాంగ వ్యతిరేక అంశాలు లేవని స్పష్టం చేసింది.అత్యున్నత న్యాయస్థానం తన తీర్పులో అత్యంత కీలకమైన అంశాలను ప్రస్తావించింది. స్థానికత మరియు ప్రాంతీయ సడలింపుల నిర్ణయం అనేది ప్రత్యేకంగా రాష్ట్రాధిపతి ఉత్తర్వుల ఆధారంగానే జరుగుతుందని గుర్తుచేసింది. ఒక రాష్ట్రంలోని స్థానిక ప్రజల, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటానికి, వారికి విద్యా అవకాశాల్లో తగిన ప్రాధాన్యత కల్పించడానికి నిరంతర నాలుగేళ్ల విద్యాభ్యాస నిబంధన అత్యంత సమంజసమైన ప్రామాణికమని ధర్మాసనం పేర్కొంది.

## ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్‌కు ఆప్ నేతల శుభాకాంక్షలు



నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాథోడ్ రమేష్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ హైదర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. వినోద్ కుమార్ సోమవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంటి స్థలాల హద్దులపై ప్రభుత్వం ఫోకస్

సామాన్యులు తమ స్థలాలను కబ్జాదారుల చేతిలో పోగొట్టుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం చేపడుతున్న ఈ అధునాతన డిజిటల్ సర్వే విధానం ద్వారా ఆక్రమణదారులు హద్దులు మార్చడానికి లేదా ఇతరుల భూములను ఆక్రమించడానికి వీలుండదు. జియో-టాగింగ్ మరియు డిజిటల్ సర్వేల ద్వారా నమోదైన రికార్డులు కచ్చితత్వంతో ఉంటాయని, వీటిలో మార్పులు చేయడం ఎవరికీ సాధ్యపడదని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.ఇంటి స్థలాల వివరాలు మరియు కొలతలు డిజిటల్ రూపంలో చట్టబద్ధంగా భద్రపరచడం వల్ల సామాన్య ప్రజలకు తమ స్థలాలపై సంపూర్ణ హక్కులు, భద్రత లభిస్తాయి. ఆస్తుల అమ్మకాలు మరియు కొనుగోలు సమయాల్లో జరిగే రిజిస్ట్రేషన్ ప్రక్రియలు అత్యంత పారదర్శకంగా, వేగంగా పూర్తవుతాయి. భూమి కొలతల నివేదికల కోసం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. అలాగే బ్యాంకు రుణాలు పొందే సమయంలో విచారణ నివేదికల కోసం నెలల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా త్వరితగతిన అనుమతులు లభిస్తాయి. దీనికితోడు ఆస్తుల క్రమబద్ధీకరణ మరియు ఇంటి నిర్మాణ అనుమతుల ప్రక్రియలో ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రజలు నేరు గా లబ్ధి పొందుతారు.రాష్ట్రవ్యాప్తంగా సర్వే రికార్డులను ఆధునీకరించడంలో భాగంగా డ్రోన్ సాంకేతికత, డిజిటల్ సర్వే విధానాలను సమర్థవంతంగా వినియోగిస్తున్నామని మంత్రి తెలిపారు. భూ వివాద రహిత తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి పారదర్శకమైన సేవలను ప్రజల ముంగిట్లోకి తెస్తామని వివరించారు. దశాబ్దాలుగా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న వేలాది భూ వివాద కేసుల సంఖ్య ఈ చర్యతో గణనీయంగా తగ్గుతుం దని భావిస్తున్నారు. ఈ విప్లవాత్మకమైన డిజిటల్ విధానం వల్ల ప్రజల ఆస్తులకు శాశ్వత రక్షణ లభించడమే కాకుండా, రెవెన్యూ వ్యవస్థలో అవినీతికి అడ్డుకట్ట పడుతుందని మంత్రి

# రెడ్ సిగ్నల్.. అయినా ఆగని వాహనాలు!

**- పోలీసులు ఉంటేనే రూల్స్.. లేకుంటే ట్రాఫిక్ ఉల్లంఘనలేనా?**
**- అవగాహనతో పాటు నిరంతర పర్యవేక్షణ అవసరం**

నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాహనదారుల భద్రత కోసం ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ వద్దే నిబంధనలు గాలికొదిలేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రెడ్ సిగ్నల్ పడినా కొందరు వాహనదారులు ఆగకుండా ముందుకు దూసుకెళ్తుండటం ప్రమాదాలకు కారణమయ్యే పరిస్థితిని సృష్టిస్తోంది. సిగ్నల్ జంపింగ్ సాధారణ విషయంగా మారితే రహదారి భద్రత ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం, రెడ్ సిగ్నల్ వద్ద ఆగడం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ ఉపయోగించకపోవడం వంటి అంశాలపై సూచనలు చేస్తున్నారు. అయినప్పటికీ కొందరు వాహనదారుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా సిగ్నల్ వద్ద పోలీసు సిబ్బంది ఉన్న సమయంలో వాహనదారులు నిబంధనలు పాటిస్తున్నప్పటికీ, వారు అక్కడి నుంచి వెళ్లిన తర్వాత పరిస్థితి మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెడ్ సిగ్నల్ పడినప్పటికీ కొందరు వాహనదారులు ముందుకు వెళ్లడం, ఖాళీ ఉందని భావించి సిగ్నల్‌ను దాటేయడం చేస్తున్నారు. ఒక వాహనం చేసిన చిన్నపాటి ఉల్లంఘనను మరో



వాహనదారుడు అనుసరించడంతో సమస్య మరింత పెరుగుతోంది.

**అవగాహన ఒక్కటే సరిపోదు**

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడం ఎంత ముఖ్యమో, వాటిని క్రమం తప్పకుండా అమలు చేయించడం కూడా అంతే అవసరం. ఒకసారి అవగాహన కల్పించి వదిలేయడం కాకుండా, సిగ్నల్స్ వద్ద నిరంతర పర్యవేక్షణ, అవసరమైన చోట్ల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పోలీసులు కనిపించినప్పుడే నిబంధనలు పాటించే పరిస్థితి ఉంటే అది ప్రజల్లో ట్రాఫిక్ క్రమశిక్షణ ఇంకా పూర్తిగా పెరగలేదనే సంకేతంగా భావించాల్సి ఉంటుంది. సిగ్నల్ అనేది కేవలం పోలీసులు ఆదేశించినప్పుడు పాటించాల్సిన సూచన కాదు. రహదారిపై ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతకు సంబంధించిన వ్యవస్థ. ఒక వాహనం సిగ్నల్ దాటడం వల్ల ఎదురుగా వచ్చే వాహనదారుడు ఊహించని పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావచ్చు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ఢీకొనడానికి, గాయాలకు, ప్రాణనష్టానికి దారితీసే ప్రమాదం ఉంది.

**"తొందర" కంటే ప్రాణం ముఖ్యం**

కొన్ని నిమిషాలు ఆలస్యం అవుతుందనే కారణంతో సిగ్నల్‌ను దాటడం ఎంతవరకు సమంజసం? ఇంటికి త్వరగా చేరుకోవాలనే తొందరలో నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రమాదం జరిగితే ఆ తర్వాత కోల్పోయిన సమయాన్ని తిరిగి పొందడం సాధ్యమా? వాహనదారులు ఒక్కసారి ఆలోచించాల్సిన ప్రశ్న ఇది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం పోలీసుల భయంతో కాదు.. మన ప్రాణాలపై మనకున్న బాధ్యతతో జరగాలి. రెడ్ సిగ్నల్ వద్ద ఆగడం వల్ల కొన్ని క్షణాలు ఆలస్యం కావచ్చు. కానీ ఆగకుండా వెళ్లడం వల్ల ఎదురయ్యే ప్రమాదం జీవితాంతం కుటుంబాన్ని వెంటాడే విషాదంగా మారే అవకాశం ఉంది.

**పోలీసులు కూడా నిరంతర నిఘా పెట్టాలి**

నిర్మల్ పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నిర్వహణ మరింత పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉందని వాహనదారులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సిగ్నల్స్ పనిచేసే తీరును ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, రద్దీ సమయాల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచడం, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా క్రమశిక్షణ పెంచే అవకాశం ఉంటుంది.

అదే సమయంలో ప్రతి ఉల్లంఘనకు జరిమానా విధించడం మాత్రమే పరిష్కారం కాదని, ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ సంస్కృతిని పెంచాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

**సిగ్నల్ పాటించడం.. ప్రతి ఒక్కరి బాధ్యత**

ట్రాఫిక్ నిబంధనలు పోలీసుల కోసం కాదు.. ప్రజల కోసమే. సిగ్నల్ వద్ద ఎవరూ చూడటం లేదని భావించి రెడ్ సిగ్నల్‌ను దాటడం అంటే మన భద్రతను మనమే ప్రమాదంలోకి నెట్టుకోవడం. పోలీసు కనిపిస్తే ఒకలా, కనిపించకపోతే మరోలా నిబంధనలు పాటించడం వల్ల రహదారి భద్రత సాధ్యం కాదు.

పోలీసులు లేకపోయినా రెడ్ సిగ్నల్ వద్ద ఆగాలి. జరిమానా భయంతో కాదు.. కుటుంబం కోసం, మన కోసం, ఎదుటి వ్యక్తి ప్రాణం కోసం. నిర్మల్ నగర రహదారులు సురక్షితంగా ఉండాలంటే పోలీసుల పర్యవేక్షణతో పాటు వాహనదారుల్లో స్వీయ క్రమశిక్షణ కూడా పెరగాలి. "నాకు ఏమవుతుంది?" అనే నిర్లక్ష్యపు ఆలోచనకు బదులు "నా వల్ల మరొకరికి ప్రమాదం జరగకూడదు" అనే బాధ్యత ప్రతి వాహనదారుడిలో ఏర్పడినప్పుడే నిజమైన ట్రాఫిక్ క్రమశిక్షణ సాధ్యమవుతుంది.

# దేవుడికి నైవేద్యం పెట్టి..
# ప్రసాదం అందరికీ ఎందుకు పంచుతాం?

ఇంట్లో పండుగైనా.. దేవాలయంలో ప్రత్యేక పూజైనా.. ముందుగా దేవుడికి నైవేద్యం పెడతాం. పూజ పూర్తయిన తర్వాత అదే ఆహారాన్ని ప్రసాదంగా అందరికీ పంచుతాం. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ప్రసాదం కోసం ఎదురుచూస్తారు. కానీ దేవుడికి సమర్పించిన ఆహారాన్ని తిరిగి అందరికీ పంచడం వెనుక ఉన్న అసలు భావం ఏమిటి?

నైవేద్యం అంటే దేవుడికి ఆహారం అవసరమని కాదు. మనకు లభించిన ఆహారం, సంపద, పంట, సౌకర్యం అన్నీ మన కృషితో మాత్రమే వచ్చాయని కాకుండా.. ప్రకృతి, సమాజం, దైవానుగ్రహం కూడా అందులో భాగమేనని గుర్తుచేసుకునే ఒక ఆధ్యాత్మిక భావన. అందుకే భోజనం చేసే ముందు దాన్ని దేవుడికి సమర్పించడం ద్వారా కృతజ్ఞతను వ్యక్తం చేస్తాం.



అయితే నైవేద్యం ప్రసాదంగా మారిన తర్వాత దానికి మరో అర్థం వస్తుంది. అది ఒక్కరి సొంతం కాదు.. అందరిదీ. చిన్న ముక్కైనా, కొద్దిపాటి పులిహోరైనా, లడ్డూయైనా.. ప్రసాదం తీసుకునే సమయంలో మనం అడిగేది దాని ధర కాదు, అందులోని భక్తి.

ప్రసాదం పంచే సంప్రదాయం మనకు మరో ముఖ్యమైన విషయాన్ని కూడా చెబుతుంది. దేవుడి ముందు ధనవంతుడు, పేదవాడు అనే తేడా ఉండదు. పెద్దవారైనా, చిన్నవారైనా ఒకే వరుసలో నిలబడి ప్రసాదం తీసుకుంటారు. మనిషి బయట ఎంత భిన్నంగా కనిపించినా.. దైవసన్నిధిలో అందరూ సమానమే అనే భావన ఇందులో కనిపిస్తుంది.

ఇంకో విషయం.. ప్రసాదం తక్కువగా ఉన్నా దాన్ని పంచడానికి మనసు వెనుకాడదు. ఎందుకంటే పంచినంత మాత్రాన అది తగ్గిపోతుందనే భావన కంటే.. పంచుకున్న ఆనందమే ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో కూడా ఇదే భావన ఉండాలి. మన దగ్గర ఉన్నది కొద్దిగా అయినా.. అవసరమైనవారితో పంచుకున్నప్పుడు దాని విలువ పెరుగుతుంది.

అందుకే రేపు దేవాలయంలో ప్రసాదం తీసుకునేటప్పుడు ఒకసారి ఆలోచించండి. మన చేతిలోకి వచ్చిన ఆ చిన్న ప్రసాదం కేవలం తినే పదార్థం కాదు.. "నాకు లభించినది నాతోనే ఆగిపోకూడదు.. నలుగురితో పంచుకోవాలి" అనే ఒక చిన్న జీవితపాఠం.

దేవుడికి పెట్టిన నైవేద్యం ప్రసాదంగా మారుతుంది.. కానీ మనిషి పంచుకున్న ప్రేమ మాత్రం మరొకరి జీవితంలో ఆశీర్వాదంగా మారుతుంది. దేవుడికి సమర్పించిన చేతులు.. తిరిగి నలుగురికి పంచే చేతులుగా మారినప్పుడే ఆ భక్తికి అసలైన పరిపూర్ణత వస్తుంది.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## డ్రైవర్ల కొరతతో ఆర్టీసీ బస్సులు రద్దు.. నిలిచిన గ్రామీణ సర్వీసులు

నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
టీజీఎస్ఆర్టీసీ నిర్మల్ డిపోలో డ్రైవర్ల కొరత తీవ్రరూపం దాల్చడంతో నిత్యం గ్రామీణ రూట్లలో నడిచే పల్లె వెలుగు బస్సులు రద్దవుతున్నాయి. డిపో పరిధిలో రోజూ 145 షెడ్యూళ్లు నడవాల్సి ఉండగా, సుమారు 30 మంది డ్రైవర్ల కొరత వేధిస్తోంది. అందుబాటులో ఉన్న డ్రైవర్లతో డబుల్ డ్యూటీలు చేయిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో సర్వీసులు నడపలేకపోతున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే సర్వీసులను అధికారులు తాత్కాలికంగా నిలిపివేయడంతో నిత్యం ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీలను తక్షణమే భర్తీ చేసి అన్ని రూట్లలో బస్సులను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



## ఖానాపూర్‌లో పెట్రోల్, డీజిల్ కొరత వాహనదారుల అవస్థలు

ఖానాపూర్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఖానాపూర్ పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో గత రెండు రోజులుగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో ప్రయాణికులు, రైతులు, నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు పెట్రోల్ కోసం అల్లాడిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇంధనం దొరక్క బంకుల ఎదుట నిరీక్షించాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు, బంకు యాజమాన్యాలు తక్షణమే స్పందించి ఇంధన కొరతను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



## గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు రూ. 18,500 వేతనం ఇవ్వాలి

నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో హామీ ప్రకారం గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు రూ. 18,500 వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ జిల్లాలోని 400 పంచాయతీల్లో 1,400 మంది కార్మికులు పనిచేస్తున్నారని, జీవో 6 ప్రకారం వేతనాలు పెంచి, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో సమావేశమై 25 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బొమ్మెన సురేష్, అధ్యక్షుడిగా పశుల పోషలింగు, ప్రధాన కార్యదర్శిగా కొక్కుల నాగేష్ ఎన్నికయ్యారు.



## రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్‌గా గొజ్జ జనార్దన్ ఎన్నిక

నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 15 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, చైర్మన్ పదవికి జరిగిన పోటీలో యాటకారి సాయన్నపై గొజ్జ జనార్దన్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా ఎంసీ లింగన్న, ట్రెజరర్‌గా అల్లాడి రవి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా సామనపల్లి రాఘవులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి కె. సత్యనారాయణ ప్రకటించారు. సహాయ ఎన్నికల అధికారి శరత్ బాబు, సిబ్బంది సమన్వయంతో ఎన్నికలను నిర్వహించారు.



## రెడ్ క్రాస్ ఎన్నికల్లో వివక్ష చూపారు సభ్యుడు రవీందర్ ఆరోపణ

నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా, వివక్షాపూరితంగా జరిగాయని సొసైటీ సభ్యుడు రవీందర్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్లుగా కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన దళితులు, ముదిరాజ్‌లు, మైనార్టీ వర్గాలకు పదవుల్లో ప్రాతినిధ్యం ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. మూడు గ్రూపులు సమన్వయంతో పనిచేద్దామని చెప్పి పెద్దమనుషులే వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. 75 సార్లు రక్తదానం చేసిన సాయన్న వంటి సేవా తత్పరులను విస్మరించడం బాధాకరమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి న్యాయం జరిగే వరకు పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.




## బాసర గోదావరి వంతెనపై యువకుడి హల్‌చల్: కాపాడిన సిబ్బంది

బాసర, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర గోదావరి నది రోడ్డు వంతెనపై సోమవారం ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా కాంట్రాక్ట్ సిబ్బంది, పోలీసులు సమయస్ఫూర్తితో కాపాడారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలానికి చెందిన నవీన్ అనే యువకుడు తనకు బైక్ కొనివ్వాలని ఇంట్లో గొడవపడి, మనస్తాపంతో బాసర గోదావరి వంతెనపైకి చేరుకుని దూకేందుకు యత్నించాడు. అప్రమత్తమైన వాగ్దేవి ఏజెన్సీ సిబ్బంది గణపతి, శ్రీనివాస్, బోటింగ్ సిబ్బంది గంగాధర్, నరేష్, సతీష్ మరియు పోలీసులు అతన్ని పట్టుకుని నచ్చజెప్పారు. బైక్ కొనిపిస్తామని భరోసా ఇచ్చి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.



## మత్తు పదార్థాల రహిత భారత నిర్మాణానికి విద్యార్థుల ప్రతిజ్ఞ

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నశా ముక్త భారత్ అభియాన్ (యువముక్తి) కార్యక్రమంలో భాగంగా లక్ష్మణచాంద మండలంలోని పీచర, మల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సోమవారం విద్యార్థులతో మత్తు పదార్థాల రహిత ప్రతిజ్ఞ చేయించారు. హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ నటరాజ్ గౌడ్, ఆరోగ్య సహాయకుడు శివకృష్ణ గౌడ్ హాజరై విద్యార్థులు ధూమపానం, మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎం భారతి, ఆశా కార్యకర్తలు వనిత, పుష్ప, సరిత పాల్గొన్నారు.



తెలంగాణ
వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871


# అర్జీలకే యువ వికాసం..

# ఎప్పుడొస్తుందో రుణం?

- ఏడాది దాటినా ముందుకు సాగని ప్రక్రియ..
- నిర్మల్ జిల్లాలో 35 వేలకు పైగా దరఖాస్తులు
- యూనిట్ల కోసం నిరుద్యోగ యువత ఎదురుచూపులు..
- అధికారిక స్పష్టత కోసం నిరీక్షణ




నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, తమ కాళ్లపై తాము నిలబడేలా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం జిల్లాలో దరఖాస్తుల స్వీకరణకే పరిమితమైందనే ఆవేదన దరఖాస్తుదారుల్లో వ్యక్తమవుతోంది. పథకం కింద రాయితీ రుణాలు పొందేందుకు వేలాది మంది యువత ఆసక్తిగా దరఖాస్తు చేసుకోగా.. యూనిట్ల మంజూరు, రుణాల పంపిణీ విషయంలో స్పష్టత లేకపోవడంతో ఆశగా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. నిర్మల్ జిల్లాలో బీసీ, ఎంబీసీ, ఈబీసీ, ఎస్సీ, మైనారిటీ, క్రిస్టియన్ వర్గాలకు చెందిన 35 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు శాఖల గణాంకాలు సూచిస్తున్నాయి. అర్హుల ఎంపిక, ఇంటర్వ్యూలు, యూనిట్ల కేటాయింపు వంటి ప్రక్రియలు చేపట్టినప్పటికీ.. తదుపరి దశలో రుణాల పంపిణీ ఎప్పుడు జరుగుతుందనే అంశంపై దరఖాస్తుదారుల్లో అయోమయం కొనసాగుతోంది. పథకం ద్వారా చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందాలని భావించిన యువతకు నిరీక్షణ తప్పడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ప్రచారం ఘనం.. అమలు కోసం ఎదురుచూపులు**

రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించడంతో నిరుద్యోగ యువతలో భారీగా ఆశలు ఏర్పడ్డాయి. గతంలో సామాజిక వర్గాల వారీగా వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు అందించే విధానం ఉండగా, వాటిని సమన్వయం చేస్తూ ఒకే పథకం కింద స్వయం ఉపాధికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో దరఖాస్తులు స్వీకరించారు. దీంతో జిల్లాలోని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఎంపిక ప్రక్రియలో భాగంగా పలుచోట్ల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. అర్హులైన వారికి దశలవారీగా యూనిట్లు మంజూరు చేస్తామని అధికారులు అప్పట్లో పేర్కొన్నారు. అయితే నిర్ణయించిన గడువుల్లో ప్రక్రియ పూర్తికాకపోవడంతో దరఖాస్తుదారులు మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు.

**జిల్లాలో వేలాది దరఖాస్తులు**

జిల్లాలో బీసీ అభివృద్ధి శాఖ పరిధిలో 17,286 బీసీ, 504 ఎంబీసీ, 419 ఈబీసీ దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. వీటిలో 3,876 బీసీ, 842 ఈబీసీ యూనిట్లకు కేటాయింపులు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో 7,350 దరఖాస్తులకు 2,894 యూనిట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలో 5,926 మైనారిటీ, 65 క్రిస్టియన్ దరఖాస్తులు నమోదయ్యాయి. వీటిలో 1,045 మైనారిటీ, 27 క్రిస్టియన్ యూనిట్లకు కేటాయింపులు జరిగినట్లు వివరాలు ఉన్నాయి. మొత్తంగా చూస్తే దరఖాస్తుల సంఖ్యతో పోలిస్తే కేటాయింపులు పరిమితంగానే ఉండటంతో మిగిలిన దరఖాస్తుదారుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.

రాయితీతో స్వయం ఉపాధికి అవకాశం రాజీవ్ యువ వికాసం పథకం కింద వివిధ విలువల యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీతో కూడిన ఆర్థిక సహాయం అందించే విధానాన్ని రూపొందించింది. రూ.50 వేల యూనిట్‌కు పూర్తి సబ్సిడీ ఉండగా, రూ.లక్ష యూనిట్‌లో రూ.90 వేల వరకు ప్రభుత్వం, రూ.10 వేల వరకు బ్యాంకు రుణంగా ఇవ్వాలని నిర్ణయించింది.
అలాగే రూ.2 లక్షల యూనిట్‌కు రూ.1.60 లక్షల సబ్సిడీ, రూ.40 వేల బ్యాంకు రుణం, రూ.3 లక్షల యూనిట్‌కు రూ.2.10 లక్షల సబ్సిడీ, రూ.90 వేల బ్యాంకు రుణం, రూ.4 లక్షల యూనిట్‌కు రూ.2.80 లక్షల సబ్సిడీ, రూ.1.20 లక్షల బ్యాంకు రుణం అందించే విధంగా నిబంధనలు రూపొందించారు. దీంతో తమకు నచ్చిన వ్యాపారం లేదా స్వయం ఉపాధి యూనిట్‌ను ప్రారంభించుకుని కుటుంబానికి ఆసరాగా నిలవాలని అనేక మంది యువత భావించారు.
రుణం వస్తే.. వ్యాపారం ప్రారంభిస్తాం చిన్న వ్యాపారాలు, వాహనాలు, సేవా రంగానికి సంబంధించిన యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని పలువురు దరఖాస్తుదారులు భావిస్తున్నారు. కొందరు ఇప్పటికే వ్యాపారం ప్రారంభించేందుకు స్థలాలు, పరికరాలు, ఇతర ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ రుణం మంజూరు కోసం ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. మరికొందరు ఇతర ఉపాధి అవకాశాలు లేక పథకం ద్వారా వచ్చే ఆర్థిక సహాయంపైనే ఆధారపడి ఉన్నారు. దరఖాస్తులు స్వీకరించే సమయంలో చూపిన వేగంతో ఎంపిక, మంజూరు, రుణాల పంపిణీ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని యువత కోరుతోంది. తమ దరఖాస్తు ఏ దశలో ఉంది? యూనిట్ మంజూరవుతుందా? బ్యాంకు రుణం ఎప్పుడు వస్తుంది? తదితర అంశాలపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

**అధికారిక ప్రకటన కోసం నిరీక్షణ**

ప్రస్తుతం పథకం అమలులో తదుపరి దశపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన కోసం దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. యూనిట్ల కేటాయింపు జరిగిన వారికి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, మిగిలిన అర్హులైన దరఖాస్తుదారుల విషయంలోనూ స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన పథకం కేవలం దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక ప్రక్రియకే పరిమితం కాకుండా.. అర్హులైన ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తదుపరి కార్యాచరణను వెల్లడించి, రుణాల పంపిణీపై స్పష్టత ఇస్తే తమ భవిష్యత్తుకు మార్గం ఏర్పడుతుందని నిరుద్యోగ యువత ఆశిస్తోంది.

## ఆదివాసీ గూడాల సమస్యలు పరిష్కరించాలి

## కలెక్టరేట్ ఎదుట త్యాగ్స్ ధర్నా




నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లాలోని ఆదివాసీ గూడాలలో మౌలిక వసతులు కల్పించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (త్యాగ్స్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. గిరిజన రైతులు, మహిళలు డోలు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలతో కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, జిల్లా కార్యదర్శి తొడసం శంభు మాట్లాడుతూ టైగర్ జోన్ పేరుతో గిరిజనులను వేధించవద్దని, పోడు రైతులకు విద్యుత్ సౌకర్యం కోసం డీడీలు కట్టినా ఫారెస్ట్ అనుమతులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. సారంగాపూర్ మండలం లింగాపూర్ నుంచి ఇప్పచెల్మా వరకు, భూక్యా తండా నుంచి లక్ష్మీపూర్ వరకు బీటీ రోడ్లు వేయాలని, పెంబి మండలం రాముడుగూడలో సీసీ రోడ్లు, త్రీఫేస్ విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెంద్రం దత్తురామ్, దేవరావు, కాశీనాథ్, రవి, నాగోరావ్, గంగారాం పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలను వివిధ శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని అర్జీదారుల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 30న నిర్మల్‌లో ప్రైవేట్ జాబ్ మేళా

నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 30న బుధవారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో ప్రైవేట్ కంపెనీల ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి జి. విజయలక్ష్మి తెలిపారు. శ్రీకృష్ణ హోం కేర్ సర్వీసెస్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్లలో కేర్ టేకర్, హెల్త్ అడ్వైజర్, ఆఫీస్ అసోసియేట్ తదితర 60 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయి. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ విద్యార్హతలు గల 18 నుంచి 45 ఏళ్ల అభ్యర్థులు బయోడేటా, ధ్రువపత్రాల జిరాక్సులతో నేరుగా హాజరుకావచ్చని సూచించారు. వివరాలకు 8328550035, 9959865645 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు సాఫీగా పూర్తి చేయాలి




నిర్మల్/నిజామాబాద్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఖరీఫ్ (వానాకాలం) వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సాఫీగా పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్ వేదికగా నిర్మల్ జిల్లాలో వరి ధాన్యం సేకరణ ఏర్పాట్లపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్దేశిత సమయానికి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులకు అవసరమైన టార్పాలిన్లు, గన్నీ సంచులు, తూకం యంత్రాలు, తాగునీరు, నీడ వంటి సకల సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా ఆసుపత్రిలో ట్రామా సెంటర్‌ను వెంటనే ప్రారంభించాలి



నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రి ప్రాంగణంలో రూ. 23.75 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ (ట్రామా సెంటర్) పనులు పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ ప్రారంభించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి క్యాంప్ కార్యాలయం పేర్కొంది. పేద ప్రజలకు అత్యాధునిక అత్యవసర వైద్య సేవలు అందేలా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే చొరవ చూపి కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి జిల్లా ఆసుపత్రిలోని ట్రామా సెంటర్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించనున్నట్లు వెల్లడించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు




ముధోల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అధికారులు ఏమాత్రం అలసత్వం ప్రదర్శించవద్దని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్పష్టం చేశారు. సోమవారం ముధోల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి బట్టేకర్ సాయినాథ్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులకు ఫార్మర్ ఐడీ, డిజిటల్ క్రాప్ నమోదు త్వరితగతిన పూర్తి చేసి ఎరువుల కొరత రాకుండా చూడాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తూ అనవసర డిప్యుటేషన్లను రద్దు చేయాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా పారదర్శకంగా వెరిఫికేషన్ చేయాలంటూ అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవకుమార్, ఎంపీవో శివకుమార్, ఏవో రచన, ఏపీవో శిరీష పాల్గొన్నారు.

## నిర్మల్‌లో జోనల్ స్థాయి అండర్-14, 17 క్రీడా పోటీలు



నిర్మల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపిక పోటీలు సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా దీక్ష కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్, పీఈటీ సంఘం అధ్యక్షుడు వన్నెల భూమన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వారిలో అండర్-14 క్రీడాకారులు నిర్మల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు, అండర్-17 క్రీడాకారులు రంగారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి నచ్చేందర్, పీఈటీలు పోశెట్టి, భూమేష్, విద్యాసాగర్, అన్నపూర్ణ, సుదర్శన్, సాయిరాజ్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER